క్లుప్తంగా

విలువలతో కూడిన విద్యతో దేశాభివృద్ధి



పెడన: విలువలతో కూడిన విద్య దేశాభివృద్ధికి తోడ్పడుతుందని కాన్పూర్ రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి ఆత్మ శ్రద్ధానంద అన్నారు. మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రద్ధానంద మాట్లాడుతూ బుద్ధిబలం, ఆత్మబలం, ఏకాగ్రత ఎలా పెంపొందించుకోవాలనే విషయాలపై విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ రామకృష్ణ మిషన్ స్వామి యజ్ఞపురుషానంద, కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం

మోపిదేవి: ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా కందిపప్పు, బియ్యాన్ని తక్కువ ధరకే అందిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మోపిదేవి-1 గ్రామ సచివాలయం రోడ్డులో శ్రీబాలాజీ డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో సరుకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కందిపప్పు ప్రస్తుత మార్కెట్ రేటు కిలో రూ. 160 ఉండగా ప్రభుత్వం కిలో రూ. 150కే అందిస్తున్నట్లు తెలిపారు. రా రైస్ మార్కెట్‌లో కిలో రూ. 48 ఉండగా ప్రభుత్వం కిలో రూ. 47కు, స్టీం రైస్ మార్కెట్‌లో రూ. 49 ఉండగా ప్రభుత్వం కిలో రూ. 48కే అందిస్తున్నట్లు వివరించారు.

పారదర్శకంగా పాఠశాల కమిటీల ఎంపిక

గూడూరు: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల్లో ఉపాధ్యాయులు పారదర్శకంగా వ్యవహరించాలని గూడూరు మండల విద్యాశాఖ అధికారి -1 బీఎస్సీ శేఖర్‌సింగ్ కోరారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలల్లో నోటిఫికేషన్ జారీ చేసినట్లు వివరించారు. ఈనెల 8న నిర్వహించే ఎన్నికల్లో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. సమావేశంలో ఎంఈవో-2 పి.సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, సీర్పీలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి ప్రారంభించగా ఎంపీటీసీలు కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా ఆషాదేవి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈఓ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు




కోడూరు: కోడూరు-అవనిగడ్డ ప్రధాన పంట కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద నుంచి కాల్వ ఎగువ వైపునకు ఈ పనులను చేపట్టారు. కూలీల సాయంతో గుర్రపుడెక్క, తూటు, నాచును తొలగిస్తున్నారు. దిగువ కాల్వలకు కూడా సాగునీటిని పుష్కలంగా అందించాలనే లక్ష్యంతో ప్రధాన పంట కాల్వలో పనులు చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అవనిగడ్డ నుంచి కోడూరు వరకు కాల్వ పొడవునా గుర్రపు డెక్క తొలగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. పలువురు నేతలు పనులను పరిశీలించారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

బంటుమిల్లి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరద బాధితుల సహాయార్థం సీపీఎం నేతలు బంటుమిల్లిలో గురువారం విరాళాలు సేకరించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు సీపీఎం నేతలు సుమారు రూ.10వేలు సేకరించి కేరళ సీఎం సహాయ నిధికి పంపారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డేను మహిళలు గురువారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఆర్యవైశ్య మహిళా సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో దాదాపు 300 మంది పైగా మహిళలు హాజరయ్యారు. పామర్రు, గుడివాడ, పెడన, చల్లపల్లి నుంచి మహిళలు హాజరయ్యారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సన్నిధి సాయి, మహిళా నాయకురాలు వేముల శిరీష, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు తుమ్మలపల్లి విశాలాక్షి, కార్యదర్శి సామా అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగు సాగేదెలా?



సాగునీరు రాకపోవడంతో బీడుగా మారుతున్న చేను

దివిసీమలో నీరందకపోవడంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పదిరోజుల క్రితం పంట కాల్వలకు సాగునీటిని విడుదల చేశారు. అరకొరగా రావడంతో ఇంకా బ్రాంచి కాల్వలకు నీరు చేరలేదు. అవనిగడ్డ నియోజకవర్గంలో 98 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. ఇప్పటి వరకూ చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో కేవలం తొమ్మిది వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. ఏటా ఈ సమయానికి నియోజకవర్గంలో 25వేల ఎకరాలకు పైగా నాట్లు వేసేవారు. సక్రమంగా సాగునీరందక పోవడం, వర్షాలు పడకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. అలాగే కృత్తివెన్ను మండలంలోని శివారు ప్రాంతాల్లో దమ్ము చేసిన చేలు నీరులేక ఎండిపోతుండగా, మరికొన్ని చోట్ల నీరులేక భూములు బీళ్లుగా మారిపోతున్నాయి. కాల్వలకు సమీపంలో ఉన్న రైతులు ప్రతి రోజూ ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్నారు. ఖరీఫ్‌లో పెడన నియోజకవర్గంలోని కృత్తివెన్ను 5 వేలు, గూడూరు 24 వేలు, పెడన 25 వేలు, బంటుమిల్లి మండలంలో 15 వేల ఎకరాలలో సాగును చేపట్టారు. సాగుకు పూర్తిస్థాయిలో నీరందించేలా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

–అవనిగడ్డ/కృత్తివెన్ను



మోపిదేవి లంక కాలువ కింద ఎండిపోయి చనిపోతున్న వరిదుబ్బులు



సగం వరకూ నీరొచ్చిన నాగాయతిప్ప పంటకాలువ



అడ్డపర్ర వద్ద ఆయిల్ ఇంజిన్‌ను పంట కాల్వ వద్దకు చేర్చేందుకు రైతుల పాట్లు



అడుగంటిన కృత్తివెన్ను ప్రధాన పంట కాల్వ



కోడూరు మండలం పిట్టల్లంకలో గుల్లపంపుతో నారుమడికి నీరు తోడుకుంటున్న రైతు



వి.రుద్రవరంలో సాగునీరందక ఇలా..

సామాజిక పింఛన్ల పంపిణీ



బందరు 6వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ



చిన్నాపురంలో దివ్యాంగుడికి పెన్షన్ అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



సొర్లగొందిలో పింఛన్ ఇస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. కృష్ణాలో 2,40,939 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా 2,36,432 మందికి పంపిణీ చేశారు. రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని చిన్నాపురం, నగరంలో 46వ డివిజన్‌లోని లబ్ధిదారులకు నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నం నగరంతో పాటు పెడన పట్టణంలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. జూలై నెలలో 2,42,321 మందికి ఇవ్వగా ఆగస్టు నెలలో 2,40,939 మందికి మాత్రమే పింఛన్లు అందజేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ రెండు నెలల మధ్య వ్యత్యాసం 1,382 గా ఉంది. లబ్ధిదారులు తగ్గిన విషయంపై డీఆర్డీఏ అధికారులను వివరణ కోరగా మరణించిన వారు, ఇతర జిల్లాలకు వెళ్లిన వారు ఉన్నారని చెబుతున్నారు. దీంతో పాటు జిల్లాలో నూతన పింఛన్లు ఏమీ మంజూరు కాలేదని అధికారులు తెలిపారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో మొత్తం 18,863 పింఛన్లు ఉండగా వీటిలో 18,523 మందికి గురువారం పంపిణీ చేసి 98.2 శాతం లక్ష్యాన్ని సాధించారు. మంత్రి కొల్లు రవీంద్ర నగరంలోని 49వ డివిజన్ నారాయణపురం యానాదుల కాలనీలో పింఛన్ల పంపిణీ చేశారు. కలెక్టర్ డీకే బాలాజీ నగరంలోని ఆరో డివిజన్ చిలకలపూడిలో కొమ్మోజు విజయలక్ష్మి గృహాన్ని సందర్శించి ఆమెకు రూ. 4 వేల వితంతు పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో, మచిలీపట్నం నగరపాలక సంస్థతో పాటు నాలుగు మునిసిపాల్టీల్లో 4,331 మంది సచివాలయ ఉద్యోగులతో 2,40,939 మంది లబ్ధిదారులకు రూ. 102.16 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టర్ వెంట నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: మండలంలో గురువారం 98.14 శాతం పెన్షను పంపిణీ చేశారు. పంపిణీలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు. పలుచోట్ల సర్వర్ మొరాయించడంతో పెన్షనర్లు టెన్షన్ పడ్డారు. మండలంలో 12,018 మంది పెన్షనర్లు ఉండగా దాదాపు 11,795 మందికి అందించినట్లు ఎంపీడీవో బాలకృష్ణారావు తెలిపారు.

గూడూరు: మండలంలోని కంకటావలో మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి మద్దాల మోహనరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో మొదటి రోజు 97.7శాతం పెన్షన్ల పంపిణీ పూర్తైనట్లు ఎంపీడీఓ ఎస్.ప్రేమాన్విత తెలిపారు. దీంతో జిల్లాలో 5వ స్థానంలో మండలం నిలిచిందన్నారు.

ఘంటసాల: మండలంలో పెన్షన్లు వేగంగా పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ తెలిపారు. ఘంటసాల సచివాలయాలు 1, 2 పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. శ్రీకాకుళంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చప్పిడి చిట్టి బాబు పెన్షన్ల పంపిణీ చేశారు. మండలంలో సాయంత్రం ఆరు గంటల వరకు 98.08 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు మారుతీశేషమాంబ చెప్పారు.

నాగాయలంక(అవనిగడ్డ): సొర్లగొందిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. డయాలసిస్ పేషెంట్ కొప్పనాతి లక్ష్మికి పింఛన్ అందించారు. అనంతరం సొర్లగొంది పీహెచ్‌సీని బుద్ధప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడి వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరనాథ్, డాక్టర్ కె.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

కోడూరు: కోడూరులో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. కోడూరు, ఉల్లిపాలెం, లింగారెడ్డిపాలెం, మందపాకల, పోటుమీద, హంసలదీవి, సాలెంపాలెం, పిట్టల్లంక, వి.కొత్తపాలెం, మాచవరం, జయపురం, రామకష్టాపురం పంచాయతీల్లో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నేతలు పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి



మచిలీపట్నంటౌన్: బెరాకా ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు బి. సత్యనారాయణ సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా గత నెల 30న మృతి చెందిన సత్యనారాయణ పార్థివదేహాన్ని ప్రార్థనా మందిరంలో సందర్శనార్థం ఉంచారు. మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, మాజీ ఎంపీ నారాయణరావు, రాజకీయ నాయకులు, నగర ప్రముఖులు గురువారం సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సత్యనారాయణ కుమారుడు కిరణ్‌పాల్‌ను వారు ఓదార్చారు. గురువారం జరిగిన అంతిమయాత్రలో పాస్టర్లు, సంఘస్తులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి శిక్షణ



చిట్టూర్పు(ఘంటసాల): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఉపాధికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంకు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, చల్లపల్లి యూనియన్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఎంపీడీవో మారుతీ శేషమాంబ, సర్పంచ్ వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చౌదరిబాబు, ఉప సర్పంచ్ జి.రాజ్యలక్ష్మి, యూబీ అధికారులు వెంకట్రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు చారిత్రాత్మకం

శ్రీకాకుళం(ఘంటసాల): ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని ఎంఈఎఫ్ కృష్ణా అధ్యక్షుడు బొకినాల కృష్ణ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం పంచాయతీ శివారు సూరపనేనిపాలెం ఎస్సీ కాలనీ దండోర దిమ్మె వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ రిజర్వేషన్ పోరాట యోధుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామాధ్యక్షుడు కొడాలి డేవిడ్ రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



కృత్తివెన్నులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్యామలగౌరి

కోడూరు: తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమాలునిర్వహించారు. శిశువు పుట్టిన గంటలోపు తల్లి తన పాలను పట్టిస్తే చిన్నారి ఆరోగ్యంగా ఉంటారని రాజశ్వరి తెలిపారు. హెచ్‌వీ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.పద్మజ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: తల్లిపాలను మించిన ఆహారం లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి అన్నారు. మండల పరిధిలోని కృత్తివెన్ను పల్లెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

గూడూరు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆకుమర్రులోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లవోలు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి మాట్లాడుతూ శిశువు ఆరు నెలల వయస్సు వరకు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే పట్టాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వరిగంజి లక్ష్మీకుమారి, కారుమంచి మమత, పాము నిర్మల, సీహెచ్ఓ పేరుబోయిన శ్రావణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: ముర్రుపాలతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని శ్రీకాకుళం ఘంటసాల సెక్టార్ల సూపర్‌వైజర్లు డి.మేరీ, టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల మండలంలోని ఘంటసాల సమైఖ్యత నగర్, ఘంటసాలపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

అర్హత ఉన్న సభ్యులకే ఓటు హక్కు

జిల్లా సహకార శాఖ అధికారి కె.చంద్రశేఖరరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)లో అర్హత ఉన్న సభ్యులు మాత్రమే పాలకవర్గ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉంటారని జిల్లా సహకారశాఖ అధికారి కె.చంద్రశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ వ్యవహారిక పరిధిలో వ్యవసాయ భూమి కలిగి ఉండి రూ. 300 వాటాధనంగా చెల్లించి ఉండాలని పేర్కొన్నారు. నగదు, వస్తురూపేణా సంఘానికి చెల్లించాల్సిన దానిని మూడు నెలలకు పైబడి చెల్లించకుండా డిఫాల్టరై ఉండకూడదని పేర్కొన్నారు. ఇతర డిపాజిట్లు, అడ్వాన్స్‌లు కాకుండా ఎన్నికల ప్రకటన తేదీకి ముందు 12 నెలల కాలవ్యధిలో రూ. 10వేలు కనీస వ్యాపారాన్ని నిర్వహించిన సంఘంలోని రుణగ్రహీతల సభ్యుడు పూర్తి ఓటు హక్కు కలిగి ఉంటారన్నారు. భూమి లేకుండా సంఘంలో కొనసాగుతున్న సహ సభ్యుడు సంఘంలో ఎన్నికల ప్రకటన తేదీ ముందు 12 నెలలకు పైబడి రూ. 10వేలు డిపాజిట్ కలిగి ఉన్న వ్యక్తి, సహ సభ్యుడు ఓటు హక్కు కలిగి ఉంటారని వివరించారు. సహ సభ్యుడిగా ఉన్న ప్రతి గ్రూపు రుణగ్రహీత, గ్రూపు డిపాజిటర్, ఆ గ్రూప్ ద్వారా నామినేటెడ్ చేయబడిన ప్రతినిధికి ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎలక్షన్ ప్రకటన తేదీ నాటికి 30 రోజుల ముందుగా సంఘ వ్యాపారం చేసిన సభ్యుడై ఉండాలని పేర్కొన్నారు. ఈ నిబంధనలతో పీఏసీఎస్‌ల్లో పాలకవర్గానికి పోటీ చేసేందుకు అర్హులై ఉంటారని ఆయన తెలిపారు.

12వ నంబర్ కాల్వకు సాగునీరు



సాక్షి ఎఫెక్ట్..

మోపిదేవి: మండల పరిధిలోని 12వ నంబర్ కాల్వకు సాగునీరు విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. 'సాక్షి' గురువారం 'సాగునీరు లేక ఎండిపోతున్న వరినాట్లు' శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు సాగునీరును విడుదల చేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె



సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు

దేవరకోట(ఘంటసాల): దేవరకోట, ఘంటసాల గ్రామాల ఇలవేల్పు శ్రీ కోట ముత్యాలమ్మ తల్లికి ఆయా గ్రామాలకు చెందిన మహిళలు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. ఘంటసాల గ్రామానికి చెందిన దోనేపూడి జానకి ఆధ్వర్యంలో దేవరకోట, ఘంటసాల గ్రామాల మహిళలు వివిధ రకాల పిండివంటలు, స్వీట్లు, పండ్లు, ఫలహారాలు, నూతన వస్త్రాలు, ఇతర వస్తువులు, పసుపు, కుంకుమతో గ్రామోత్సవంగా వెళ్లి గ్రామ శివారులోని శ్రీ కోట ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఘంటసాల, దేవరకోట గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

మోపిదేవి: గౌడపాలెంలో అంకమ్మతల్లికి గురువారం యార్లగడ్డవారి వంశీకులు, ఆడపడుచులు ఆషాఢ సారెను అందజేశారు.

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారికి గురువారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించి భక్తి భావం చాటుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముంపు సమస్యలేకుండా చర్యలు తీసుకోండి

అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బందలాయిచెరువు(అవనిగడ్డ): పంటపొలాలు ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బందలాయిచెరువు వద్ద చేపట్టిన డ్రైనేజీ అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బందలాయిచెరువు, అశ్వరావుపాలెం, పోటుమీద పరిధిలోని పంటపొలాల మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యను కలెక్టర్ బాలాజీ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి షార్ట్ టెండర్ పద్ధతిలో డ్రైనేజీ పనులు చేపట్టినట్టు బుద్ధప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డ్రైనేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీకి సన్మానం



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానించి అభినందిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

కోనేరుసెంటర్: కృష్ణా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన జి.వెంకటేశ్వరరావు దంపతులను ఎస్పీ గంగాధర్‌రావు బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. నగరంలోని సుమ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీసుశాఖకు ఎనలేని సేవలను వెంకటేశ్వరరావు అందించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసులో రిటైర్‌మెంట్ అనేది తప్పని ధర్మంగా భావించాలన్నారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతులను ఎస్పీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఎస్పీ కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

పెనమలూరు: హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్‌లు ప్రమాదాల నుంచి కాపాడతాయన్నారు. హెల్మెట్ తలకు రక్షణ కవచం వంటిదని చెప్పారు. ఈ సందర్భంగా కాలేజీ నుంచి 100 అడుగుల రోడ్డు వరకు హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఇంగ్లిష్ విభాగాధిపతి రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

గన్నవరం రూరల్: మండలంలోని ఉద్యాన పంటల రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల ఇన్‌చార్జి అధికారి హరిచంద్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగు రైతులు పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలని చెప్పారు.